సాక్షి తిరుపతి

గురువారం । 2 । మార్చి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,164

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.66,200
రిటైల్ వెండి గ్రాము	రూ.68.20

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	17
చిత్తూరు	34	17
తిరుమల	29	14
గూడూరు	34	19
నగరి	35	18



ముందుచూపుతో తప్పిన ప్రాణనష్టం

ఫాక్స్‌లింక్ కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కార్మికులు 750మంది సురక్షితంగా బయటపడడం అధికారుల ముందుచూపు చర్యల ఫలితమేనని యాజమాన్యం తెలియజేస్తోంది. – 8లో

న్యూస్‌రీల్

శరవేగంగా గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం గర్భాలయ స్తంభవర్గం కూర్పులు చేపట్టారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష స్తంభవర్గం రాతి శిలకు పూజలు చేసి హారతి సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏప్రిల్ నెలాఖరులోపు అమ్మవారి గర్భాలయ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

పశు సంరక్షణకు టీకా తప్పనిసరి



టీకాను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పశు సంరక్షణకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని, తద్వారా పాడి ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గాలికుంటు నిరోధక టీకాను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు టీకా అందుబాటులో ఉంటుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల వద్ద టీకాలు వేస్తారని వెల్లడించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రవికుమార్ మాట్లాడుతూ గాలికుంటు టీకా వేయిద్దాం-పశువుల ఆరోగ్యాన్ని కాపాడుదాం అనే నినాదంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులకు ఈ టీకాను వేయించాలని కోరారు. జిల్లాలో మొత్తం 5,42,293 పశువులకు వ్యాక్సిన్ వేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీలు గురునాథ్, భవానీ శంకర్, డాక్టర్లు శిల్పారెడ్డి, శైలజ, నాగశిల్ప, శ్రీదేవి పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శేఖర్



నాయుడుపేటటౌన్ : యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నాయుడుపేటకు చెందిన కంజర్ల శేఖర్ ఎన్నికయ్యారు. బుధవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో శేఖర్‌ను ఎన్నుకోవడంపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్లకు ఆమోదం



బిడ్డ పెళ్లి ఖర్చులకు భూమి అమ్ముదామనుకుంటే ఎవరూ ముందుకు రావడం లేదే..? స్థలం తెగనమ్మి నాన్నకు ఆపరేషన్ చేయిద్దామనుకున్నానే.. రిజిస్ట్రేషన్ కుదరదంటున్నారే..? కొడుకు చదువు కోసం ఫ్లాట్ సేల్‌కు పెడితే అది నిషేధ జాబితాలో ఉందంటున్నారే..? ఇలా నలిగిపోతున్న తిరుపతి నగరవాసులకు ఊరట లభించింది. 22 ఏ జాబితాలో చేర్చిన భూముల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం ఈ మేరకు దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చిత్తశుద్ధితో చేసిన కృషి ఫలించింది.

- తిరుపతిలో 22 ఏ జాబితాలోని భూములపై నిషేధం ఎత్తివేత
- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయశాఖ
- ఫలించిన ఎమ్మెల్యే భూమన కృషి
- షెడ్యూలింగ్‌ను సవరించనున్న టీటీడీ

తిరుపతి తుడా : తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్లపై విధించిన నిషేధాన్ని తొలగిస్తూ దేవదాయ శాఖ కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు టీటీడీ సమర్పించిన షెడ్యూలింగ్‌లోని సర్వేనెంబర్లపై బ్యాన్ ఎత్తివేశామని, రిజిస్ట్రేషన్లు యధావిధిగా చేపట్టాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీకి ఆదేశాల కాపీని అందజేసింది.

ఏమిటీ వివాదం!

గత టీడీపీ హయాంలో రాష్ట్రంలో విచ్చల విడిగా ప్రభుత్వ, చుక్కల భూములు, దేవదాయ శాఖ, మఠం భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో అప్పటి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 2018లో ఆయా శాఖలకు సంబంధించిన భూముల వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే అప్పట్లో భూ వివరాలను టీటీడీ సకాలంలో అందించలేకపోయింది. ఇటీవల దేవదాయ శాఖ వివరణ కోరడంతో టీటీడీ అధికారులు యుద్ధప్రాతిదికన ఆస్తుల వివరాలను షెడ్యూలింగ్ చేసి పంపించారు. ఆ మేరకు జాబితాలోని భూముల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేస్తూ దేవదాయశాఖ 22ఎ నిషేధిత జాబితాలో చేర్చింది. ఇందులోనే టీటీడీ చిన్న పొరపాటు చేసింది. ఉదాహరణకు సర్వేనంబర్ 950లో మొత్తం 28 ఎకరాలు ఉంటే, అందులో టీటీడీకి సంబంధించిన భూమి 2 ఎకరాలున్నా మొత్తం సర్వే నంబర్‌ను జాబితాలో చేర్చేసింది. దీంతో మిగిలిన 26 ఎకరాల రిజిస్ట్రేషన్లపై కూడా నిషేధ ప్రభావం పడింది. టీటీడీకి సంబంధించిన ఆస్తి మేరకు సర్వే నంబర్ సబ్ డివిజన్ చేసి పంపించి ఉంటే సమస్య తలెత్తేది కాదు. అయితే సబ్ డివిజన్ చేయకుండా షెడ్యూలింగ్ చేయడం వల్ల తిరుపతిలోని సుమారు 2,300 ఎకరాలు భూములు వివాదంలో చిక్కుకున్నాయి.

ఎమ్మెల్యే భూమన కృషి

నిషేధ జాబితాలో భూములున్న వారు వెంటనే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సంప్రదించారు. తమ సమస్యలను తీర్చాలని విన్నవించారు. ఆయన సకాలంలో స్పందించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, దేవదాయశాఖ కమిషనర్‌తో మంతనాలు చేశారు. ఎట్టకేలకు ప్రజలకు ఇబ్బందిలేకుండా సమస్యను పరిష్కరించారు.

టీటీడీ వివరణ

నిషేధ జాబితా వివాదంపై టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్పందించారు. తాము సమర్పించిన జాబితాలో తప్పులు సరిదిద్దాల్సి ఉన్నందున నిషేధం ఎత్తివేయాలని దేవదాయశాఖకు వివరణ ఇచ్చారు. త్వరలోనే సర్వేనంబర్ల వారీగా సబ్ డివిజన్ చేసి రీషెడ్యూలింగ్ తుది జాబితా అందిస్తామని తెలిపారు.

యథావిధిగా ప్రక్రియ

తిరుపతి నగరంలోని నిషేధిత జాబితాలోని ప్రైవేట్ వ్యక్తుల భూముల రిజిస్ట్రేషన్లు కొనసాగనున్నాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లకు గురువారం ఉత్తర్వులు అందనున్నాయి.

ప్రజలకు అండగా ఉంటాం



“ తిరుపతి నగరంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు ప్రాంతాల భూములను 22 ఏ నిషేధిత జాబితాలోకి చేర్చేసింది. ఏడాది క్రితం శివజ్యోతినగర్‌లోని నిషేధిత జాబితా నుంచి సుమారు 750 మందికి చెందిన స్థలాలను తొలగించాం. టీటీడీ సమర్పించిన షెడ్యూలింగ్‌లో సర్వేనెంబర్లను ఆధారం చేసుకోవడంతో వివాదం తలెత్తింది. సమస్య ఉత్పన్నమైన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కరించారు. ప్రజలకు నష్టం చేసే ఏ విషయాన్ని ఉపేక్షించం. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. – **భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి**

ప్రసన్న వెంకన్నకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకు వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల: మండలంలోని ఆవులపల్లెలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆవులపల్లె వద్ద సుమారు రూ.800 కోట్లతో నిర్మిస్తున్న సీతమ్మ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను మంత్రి పెద్దిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించగా, సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సవాల్‌కు సై

ఆధ్యాత్మిక క్షేత్రం పరిశుభ్రంగా ఉండాలి.. తిరునగరి ఖ్యాతి ఇనుమడించాలి.. స్వచ్ఛసర్వేక్షణ్ పోటీల్లో ఆధిపత్యాన్ని కొనసాగించాలి.. జాతీయస్థాయిలో తిరుపతి పరపతిని మరింత పెంచుతూ అగ్రస్థానంలో నిలబెట్టాలి. ఇదే లక్ష్యంతో నగరపాలక సంస్థ అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారు.. స్వచ్ఛ మహాయజ్ఞంలో ప్రజలను భాగస్వాములు చేస్తున్నారు.. మెరుగైన ఫలితాలు సాధించి సత్తా చాటేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.. ప్రతిష్టాత్మక పోటీల్లో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకోవడమే ధ్యేయంగా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు.

- పరిశుభ్ర నగరావిష్కణే లక్ష్యంగా అధికారుల కృషి
- ఫస్ట్ ర్యాంకు నిలబెట్టుకునేందుకు ముమ్మర కసరత్తు
- త్వరలోనే పర్యటించనున్న స్వచ్ఛభారత్ ప్రతినిధులు
- స్వచ్ఛసర్వేక్షణ్-2023లో ఓవరాల్, వాటర్‌ప్లస్ విభాగాల్లో పోటీపడుతున్న తిరుపతి


సాక్షి, తిరుపతి/తిరుపతి తుడా: స్వచ్ఛ సర్వేక్షణ్-2022 పోటీల్లో తిరుపతి నగరం సత్తా చాటింది. 3 లక్షల జనాభా కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది. ఓవరాల్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏడో ర్యాంకు దక్కించుకుంది. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంది. ఫైవ్‌స్టార్ రేటింగ్ సొంతం చేసుకుని జాతీయ స్థాయిలో కీర్తిపతాకను ఎగురవేసింది. అదే ఉత్సాహంతో స్వచ్ఛసర్వేక్షణ్-2023లోనూ ఉత్తమ ర్యాంకులు పొందేందుకు నగరపాలక సంస్థ సన్నద్ధమవుతోంది. ఓవరాల్ పోటీల్లో ఈ పర్యాయం టాప్-3లో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కసరత్తు చేస్తోంది.

పోటీలు మరింత కఠినతరం

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2016లో స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో పరిశుభ్రతపై నగరాల మధ్య పోటీలు ప్రారంభించింది. అందులో భాగంగా ఏటా పకడ్బందీగా పోటీలు నిర్వహిస్తూ పలు విభాగాల్లో అవార్డులు అందిస్తోంది. అయితే ఈ పర్యాయం స్వచ్ఛ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో 7,500 మార్కులకు పోటీలు చేపట్టగా, ప్రస్తుతం 9,500 మార్కులకు పెంచింది. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా మొత్తం 4,355 నగరాలు పోటీపడుతున్నాయి. అందులో ఓవరాల్ స్వచ్ఛసర్వేక్షణ్, 3లక్షలు, ఒకలక్ష లోపు జనాభా కలిగిన నగరాలు, జోనల్ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. తిరుపతి నగరం 3లక్షల లోపు జనాభా కలిగిన నగరాల విభాగంలో పోటీపడుతోంది.

ఓవరాల్ స్వచ్ఛ సర్వేక్షణ్

స్వచ్ఛసర్వేక్షణ్ ఓవరాల్ విభాగంలో సత్తా చాటేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం పటిష్టంగా ఓ వ్యవస్థను నడుపుతున్నారు. నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను 100 శాతం రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ చేస్తున్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ, తరలింపు, సెగ్రిగేషన్ ప్రక్రియను లక్ష్యానికి అనుగుణంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం తూకివాకం గ్రీన్ సిటీలో వేర్వేరు ప్లాంట్‌లను నిర్వహిస్తున్నారు. అలానే నగరంలో పబ్లిక్ టాయ్‌లెట్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రజలకు మెరుగైన మౌలికవ వసతులు కల్పించేందుకు రూ.కోట్లు వెచ్చిస్తున్నారు.



తూకివాకం గ్రీన్ సిటీ వద్ద వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం

వాటర్ ప్లస్ విభాగంలో..

గత ఏడాది వాటర్‌ప్లస్ విభాగంలో దక్షిణాది రాష్ట్రాల్లోనే తిరుపతి తొలిస్థానం దక్కించుకుంది. ఈ పర్యాయం జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఇందుకోసం కార్పొరేషన్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. నగరంలో రోజువారీ 33 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) వ్యర్థపునీరును శుద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా తూకివాకంలోని వ్యర్థపునీటి శుద్ధి కేంద్రాన్ని మరింత విస్తరించారు. వేస్ట్ వాటర్‌ను వివిధ దశల్లో శుద్ధి చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నారు. ఇలా శుద్ధి చేసిన నీటిని ల్యాంకో ఫ్యాక్టరీకి రోజు 6 ఎంఎల్‌డీని సరఫరా చేసి తద్వారా నగరపాలక సంస్థకు ప్రతి నెలా రూ.8లక్షల ఆదాయం సమకూరుస్తున్నారు. మరిన్ని ఫ్యాక్టరీలకు సైతం సరఫరా చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అలాగే రెండు నెలల క్రితం నగరంలోని వినాయక సాగర్ వద్ద వ్యర్థపు నీటి శుద్ధికి మరో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ రోజు 5ఎంఎల్‌డీ వాటర్‌ను శుద్ధి చేస్తూ వినాయకసాగర్‌లోనే నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుద్ధి చేసిన నీటిని దిగువ ప్రాంతాల్లోని రైతులకు ఉచితంగా అందిస్తున్నారు.



వినాయక సాగర్ వద్ద కొత్త టెక్నాలజీతో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం

ఆధారాలతో సేవల అప్‌లోడ్

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలకు అవసరమైన డాక్యుమెంట్లను అధికారులు పకడ్బందీగా సిద్ధం చేశారు. పోటీ పడుతున్న అంశాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆధారాలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి స్వచ్ఛభారత్ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశుభ్రత, చెత్త సేకరణ, టాయిలెట్ల నిర్వహణ, ప్రాసెసింగ్ వంటి అంశాలను స్వచ్ఛభారత్ ప్రతినిధులు నేరుగా పరిశీలించనున్న క్రమంలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో సాధించిన ర్యాంకులు

సంవత్సరం	ర్యాంకు	సంవత్సరం	ర్యాంకు
2017	9	2020	6
2018	6	2021	రద్దు
2019	8	2022	1

స్వచ్ఛత కోసం వ్యవస్థ

- ఉత్పత్తి అయ్యే చెత్త : 219 మెట్రిక్ టన్నులు
- మొత్తం పారిశుధ్య కార్మికులు : 935 మంది
- చెత్త సేకరణ ఆటోలు : 105
- మినీ జేసీబీలు : 6
- జేసీబీలు : 4
- ట్రాక్టర్లు : 12
- టిప్పర్లు : 3
- క్యామ్ ఫ్యాక్టర్లు : 19

పర్యవేక్షకులు

- కమిషనర్ : అనుపమ అంజలి
- డిప్యూటీ కమిషనర్ : చంద్రమౌళీశ్వరరెడ్డి
- హెల్త్ ఆఫీసర్ : డాక్టర్ హరికృష్ణ
- సూపరింటెండెంట్ ఇంజినీర్ : మోహన్
- ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్: విజయకుమార్‌రెడ్డి
- శానెటరీ సూపర్‌వైజర్లు : చెంచయ్య, సుమతి
- శానెటరీ ఇన్‌స్పెక్టర్లు : 18 మంది
- శానెటరీ మేస్త్రీలు : 50 మంది
- శానెటరీ సెక్రటరీలు : 92 మంది

రోల్‌మోడల్‌గా నిలపడమే లక్ష్యం

“ తిరుపతి నగరాన్ని రోల్‌మోడల్‌గా నిలపడమే లక్ష్యం. అన్ని విభాగాల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ్, స్మార్ట్‌సిటీ అంశాల్లో తిరుపతి అగ్రస్థానంలో నిలబెట్టేందుకు పక్కాగా ముందుకు సాగుతున్నాం. ఈ పర్యాయం మరింత ఉత్తమ ర్యాంకులు పొందేందుకు పటిష్టంగా చర్యలు చేపట్టాం.

– డాక్టర్ శిరీష, మేయర్, తిరుపతి

ప్రజల భాగస్వామ్యంతోనే

స్వచ్ఛపోటీల్లో నగర ప్రజల భాగస్వామ్యం మరువలేనిది. గత ఏడాది ప్రెసిడెంట్ అవార్డుతో పాటు ఓవరాల్ ర్యాంకింగ్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాం. నగరానికి ఫైవ్ స్టార్ రేటింగ్ రావడం వెనుక ప్రజల సహకారం ఎంతో వుంది. ఈ పర్యాయం కూడా ప్రతిభ కనబరిచేందుకు సమన్వయంతో ముందుకు వెళుతున్నాం. తిరుపతి ఖ్యాతిని మరింత ఉన్నతస్థితికి తీసుకెళతాం.

– అనుపమ అంజలి, కమిషనర్, నగరపాలకసంస్థ, తిరుపతి

నిబంధనల మేరకే పోలింగ్



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఇతర అధికారులు

తిరుపతి అర్బన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిబంధనల మేరకే పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పీఓలు, ఏపీఓలు స్పష్టంగా అర్థం చేసుకోవాలని సూచించారు. అనుమానాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. 9వ తేదీన నిర్వహించనున్న రెండోసారి శిక్షణలో బ్యాలెట్స్ బాక్స్ ఓపెన్ చేయడం, ఓటింగ్ పూర్తిఅయిన తర్వాత క్లోజ్ చేసి సీల్ వేయడంపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఎవరైనా ఓటును బ్యాలెట్‌బాక్స్‌లో వేయకుండా తీసుకెళ్లేందుకు యత్నిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల 12వ తేదీన రెవెన్యూ డివిజన్ పరిధిలోకి పోలింగ్ సామగ్రి చేరుకుంటుందని చెప్పారు. ఏమైనా ఇబ్బందులుంటే ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, తిరుపతి నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటరమణ, జరీనా పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, ఏఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓలు కనకనరసారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నాటికి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4వ తేది నాటికి పోలింగ్ మెటీరియల్ సిద్ధం చేస్తామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 62 పోలింగ్ కేంద్రాలతోపాటు అనుబంధంగా 39 సెంటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ రోజు బందోబస్తుకు నలుగురు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 29 మంది సీఐలు, 62 మంది ఎస్‌ఐలు, 202 మంది ఏఎస్‌ఐలు, 692 మంది పోలీసులు, 138 మంది హోం గార్డులను నియమించామని వెల్లడించారు

శ్రీసిటీలో అరుణాచల్‌ప్రదేశ్ విద్యార్థి బృందం


విద్యార్థులతో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన 28 మంది విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ యువసంఘం కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా చివరి రోజు శ్రీసిటీకి వచ్చిన విద్యార్థులకు మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ స్ఫూర్తికి శ్రీసిటీ చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. అనంతరం విద్యార్థులు శ్రీసిటీ పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. పలు పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమ అధ్యయనానికి, భవిష్యత్ ప్రణాళికలకు ఈ పర్యటన ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

ముందుచూపుతో తప్పిన ప్రాణనష్టం


అగ్నిప్రమాద సమయంలో అత్యవసర ద్వారాలు, మెట్ల నుంచి బయటకు వచ్చిన కార్మికులు


ప్రమాద సమయంలో పై అంతస్తు నుంచి కార్మికులు బయటకు వచ్చిన మెట్లు

రేణిగుంట: తిరుపతి విమానాయశ్రయానికి సమీపంలోని ఫాక్స్‌లింక్ కర్మాగారంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కర్మాగారం పూర్తిగా కాలి బుగ్గి అయినా.. అప్పటివరకు పనిచేస్తున్న కార్మికులు 750మంది సురక్షితంగా బయటపడడం ప్రభుత్వ అధికారుల ముందుచూపు చర్యల ఫలితమేనని కర్మాగారం యాజమాన్యం తెలియజేస్తోంది. నిర్మాణ సమయంలో పైఅంతస్తులో 250 మంది కార్మికులు విధులు నిర్వహించేందుకు వీలుగా గదులు ఏర్పాటుచేశారు. పై అంతస్తులో ఏవైనా ప్రమాదాలు జరిగితే కార్మికులు కిందకు త్వరగా దిగేందుకు ఎమర్జెన్సీ మెట్లు, తలుపులు అమర్చలేదు. అప్పటి కర్మాగారాల డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌రెడ్డి ఎమర్జెన్సీ ద్వారాలు, ఇనుప మెట్లు ఏర్పాటుచేయాలని లేకుంటే అనుమతి ఇవ్వనని కర్మాగారం యాజమాన్యాన్ని ఆదేశించారు. అంతటితో ఆగకుండా ఆయనే చొరవ తీసుకుని దగ్గరుండి గోడ పగులగొట్టి ఎమర్జెన్సీ ద్వారం, తలుపులు ఏర్పాటు చేయించారు. సోమవారం కర్మాగారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పై అంతస్తులోని 250 మంది కార్మికులు ఎమర్జెన్సీ ద్వారం నుంచి కొద్ది నిమిషాల వ్యవధిలో మూడు వైపుల నుంచి కిందకు దిగి ప్రమాదం నుంచి సురక్షితంగా తప్పించుకోగలిగారు. ఈ ప్రమాదం జరిగాక, కంపెనీ ప్రతినిధులు తనతో మాట్లాడి అప్పట్లో పటిష్ట చర్యలు తీసుకోకుంటే పెను విపత్తు సంభవించేదని స్పష్టం చేయడం తనకు ఎంతో సంతృప్తిని మిగిల్చిందని శివకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనతోపాటు సురక్షిత చర్యలు గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి అనుమతులను ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

వేదనకు గురిచేసినందుకు ఫోరం అక్షింతలు

చిత్తూరు అర్బన్: అవసరాల కోసం అప్పుతీసుకుని, ఆపై దాన్ని తీర్చేసినా నో డ్యూ సర్టిఫికేట్ ఇవ్వకుండా మానసిక క్షోభకు గురిచేసిన ఫైనాన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ (ఫోరం) మొట్టికాయలు వేసింది. మదనపల్లెకు చెందిన బాధితుడికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని చిత్తూరులోని ఫోరం బుధవారం తీర్పునిచ్చింది. మదనపల్లెకు చెందిన గుస్సా వెంకటాచలపతి నాయుడు తన అవసరాల కోసం 2019లో స్థానికంగా ఉన్న ఫైవ్‌స్టార్ బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 24 నెలల్లో ఈఎంఐ చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. 2021 నవంబర్ వరకు ప్రతి నెలా కంతు చెల్లిస్తూ వచ్చిన వెంకటాచలపతి నాయుడు.. అదే నెల అడ్వాన్సు చెల్లింపులను సైతం ఒకేసారి కట్టేశాడు. తర్వాత నో డ్యూ సర్టిఫికెట్ అడిగితే అదనంగా రూ.6 లక్షలు చెల్లించాలని నోటీసులు పంపారు. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించగా, వినియోగదారుడు పడ్డ మానసిక వేదనకు రూ.లక్ష పరిహారం, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు అదనంగా చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పునిచ్చింది.

పట్టుకున్నారు.. వదిలేశారు!

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌లో బుధవారం ఓ పార్శిల్‌ను అపహరించిన వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మెడికల్ సామగ్రితో ఉన్న పార్శిల్ తీసుకుని వెళుతుండగా సీసీ కెమెరాల్లో గమనించి అడ్డుకున్నారు. అయితే ఆ వ్యక్తి ఓ ఉన్నత ఉద్యోగి భర్త కావడంతో సెక్యూరిటీ వాళ్లు కేవలం హెచ్చరించి వదిలేసినట్లు సమాచారం. దీనిపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల పార్శిళ్ల భద్రత విషయంలో ఆర్టీసీ మరింత జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


గాంధీనగర్ వద్ద రెండు లారీలు ఢీకొన్న దృశ్యం

పలమనేరు: పట్టణ సమీపంలో చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం జరిగాయి. నాగమంగళం వద్ద వేకువజామున రోడ్డు దాటుతున్న వెస్ట్ బెంగాల్ వాసి దిల్‌బచ్చర్‌ఓరన్(40)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కలకత్తా నుంచి కేరళకు ప్రవేటు బస్సులో వస్తున్నాడు. నాగమంగళం వద్ద బస్సు ఆపగా కాలకృత్యాల కోసం ఆవ్యక్తి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మరోవైపు పట్టణ సమీపంలోని గాంధీనగర్ వద్ద మరమ్మతులకు గురైన లారీని వెనుకవైపునుంచి మరో టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ పుంగనూరుకు చెందిన జఫ్రుల్లాఖాన్(43) తీవ్రంగా గాయపడ్డాడు. ఇతని కుడిచేయి తెగి కిందపడింది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతా క్షేమంగా ఉండాలని ప్రార్థించా

- కాణిపాకం వినాయకుడిని, తిరుమ లేశుని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని



కాణిపాకం ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, తిరుమల ఆలయం వెలుపల డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

తిరుమల / కాణిపాకం(యాదమరి): అందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించానని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని, కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం కాణిపాకంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలందరూ, వారితో పాటు తాను క్షేమంగా, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానని తెలిపారు.

సీఎంకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరా : డిప్యూటీ స్పీకర్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నడిపేందుకు అవసరం అయ్యే శక్తి ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ నెలలో జరుగబోయే బడ్జెట్ శాసనసభ సమావేశాలు సాఫీగా సాగాలని, ఈ సమావేశాలకు ఎటువంటి అవరోధం కలిగించకుండా ప్రతిపక్షానికి మంచి జ్ఞానం కలిగించాలని వేడుకున్నానని చెప్పారు.

సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన రూబీ, చిన్నారులు

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని మహాదేవయ్య నగర్‌లో బుధవారం షేక్ బాహిద్ అనే వ్యక్తి ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బాహిద్ కొంత కాలంగా పట్టణంలో పానీపూరీ అమ్ముకుంటూ జీనవం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్ నింపుతుండగా ప్రమాదం సంభవించింది. దీంతో బాహిద్‌తో పాటు అతడి భార్య రూబీ, పిల్లలు నౌషద్, నగ్మా, ఆస్మా తీవ్రంగా గాయపడ్డారు. రూబీ, నగ్మా పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


రాజశేఖర్‌రెడ్డి మృతదేహం

చంద్రగిరి : మండలంలోని కోదండరామాపురం వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. పల్నాడు జిల్లా దాచేపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డి(43) తన కుటుంబ సభ్యులతో కలసి కారులో కాణిపాకం వినాయక స్వామి దర్శనానికి బయలుదేరారు. డ్రైవింగ్ చేస్తూ నిద్రలోకి జారుకోవడంతో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ప్రమాదంలో రాజశేఖర్, మల్లీశ్వరి, తిరుపతమ్మ, సంధ్య గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. మెరుగైన వైద్య కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాజశేఖర్ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ : నలుగురికి గాయాలు

తడ: మండలంలోని కాదలూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. వివరాలు.. సూళ్లూరుపేట మండలం జంగాలగుంటకు చెందిన తిన్నలూరి శేఖర్ కాదలూరుకు వెళ్లాడు. మరో వ్యక్తితో కలిసి బైక్ రోడ్డు దాటుతుండగా, ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వస్తున్న మణిరెడ్డి, లక్ష్మి దంపతులు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి.

ఇకపై రెండు మండలాలుగా చిత్తూరు

- అర్బన్, రూరల్ మండలాలుగా గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- గతంలో హామీ నెరవేర్చలేకపోయిన టీడీపీ
- చిత్తూరు వాసుల హర్షం


చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు వాసుల చిరకాల కోరికను ప్రభుత్వం నెరవేర్చింది. పరిధిలో ఎక్కువగా ఉన్న చిత్తూరును అర్బన్, రూరల్‌గా విభజిస్తూ బుధవారం గెజిట్ నెంబర్ 256ను జారీచేసింది. అభ్యంతరాలు, సలహాలను తెలియజేసేందుకు 30 రోజుల పాటు అవకాశం కల్పించింది. పరిధిలో ఎక్కువగా ఉన్న చిత్తూరు మండలాన్ని రెండుగా చేయాలన్నది స్థానికుల సంవత్సరాల కోరిక. గతంలో టీడీపీ ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చిన దాఖలాలు లేవు. అలాగే చిత్తూరు మండల విభజన హామీని కూడా అప్పటి టీడీపీ పాలకులు అటకెక్కించారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సర్కారు ప్రజల ఆకాంక్షలకు అమలుకు శ్రీకారం చుట్టింది.

భౌగోళికంగా చిత్తూరు 54,949 ఎకరాల్లో..

భౌగోళికంగా 54,949 ఎకరాల్లో 41 రెవెన్యూ గ్రామాలతో చిత్తూరు మండలం కొనసాగుతోంది. పలు గ్రామాలు దూరంగా ఉండడంతో ప్రభుత్వ సేవలు పొందేందుకు ఇబ్బంది కరంగా ఉంటోంది. రెవెన్యూ, ఎంపీడీవో, ఎంఈవో, ఇతర మండల అధికారులకు పనిభారంతో సతమతమవుతున్నారు. ఇకపై ఆ సమస్యలు తొలగనున్నాయి. చిత్తూరు అర్బన్, రూరల్ మండలాలు ఏర్పాటు అవుతుండడంతో ప్రజలకు మరింతగా నాణ్యమైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుంది.

గెజిట్ ప్రకారం....

- చిత్తూరు అర్బన్ పరిధిలోకి 15 రెవెన్యూ గ్రామాలను తీసుకొచ్చారు. తిమ్మసముద్రం, కట్టమంచి, గాండ్లపల్లి, చిత్తూరు, గ్రీమ్స్‌పేట్, ఇరువారం, అనుపల్లి పార్ట్, అనుపల్లి, మాపాక్షి, మాపాక్షి పార్ట్, నరిగపల్లి, లక్ష్మాంబపురం, మురకంబట్టు, మంగసముద్రం, దొడ్డిపల్లి ఉంటాయి.
- చిత్తూరు రూరల్ మండల పరిధిలోకి 26 గ్రామాలను తీసుకొచ్చారు. తేనెబండ, దిగువ మాసాపల్లి, ముత్తుకూరు, అనగల్లు, పాలూరు, బీఎన్‌ఆర్‌పేట, అయనవేడు, అరతల, 194 బండపల్లి, గువ్వకల్లు, పెద్దిశెట్టిపల్లి, తుమ్మింద, సిద్ధంపల్లి, గొల్లపల్లి, వరదరాజులపల్లి, పెరుమాళ్లకండ్రిగ, చింతలగుంట, తాళంబేడు, కృష్ణాపురం, అనంతాపురం, పచ్చనపల్లి, 5-వెంకటాపురం, కురిచివేడు, అలుకురుపల్లి, 33-వెంకటాపురం, శెట్టియప్పతంగాల్‌ను కలిపారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్, పక్కన జేసీ వెంకటేశ్వర్

- రిటర్నింగ్ అధికారి హరినారాయణన్
- పోలింగ్ నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ
- పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వకూడదని ఆదేశం

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకమని, ఎలాంటి పొరబాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. ఈనెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. తరగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి ఆయన పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ 13వ తేదీ ఉదయం. 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు జరుగుతుందన్నారు. శిక్షణలో పూర్తి అవగాహనను పెంపొందించుకుని పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. మరో మారు కూడా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

నిష్పక్షపాతంగా నిర్వహణ

నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్ లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్ ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పీఓ డైరీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సీల్ వేసి తరలించడం తదితర అంశాలపై అవగాహన ముఖ్యమన్నారు. పీఓలు, ఏపీఓలుగా నియమితులైన వారందరూ కేటాయించిన రెవిన్యూ డివిజన్ అధికారికి ఈనెల 12న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. సామగ్రిని అదే రోజున తీసుకుని కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సాయంత్రం కు చేరుకోవ లసి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున ఏజెంట్‌లకు పాసుల పంపిణీ చేసి, సీటింగ్ ఏర్పాట్లు ఉదయం 7 గంటలకు పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పోలింగ్ నిర్వహణ, హ్యాండ్‌బుక్‌లోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏఆర్‌ఓ, డీఆర్‌ఓ ఎన్. రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

7లోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాకు సంబంధించి ఈనెల 7వ తేదీ లోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేస్తామని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై బుధవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంలో సమీక్షించారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.ఆరు జిల్లాల అధికారులను సమన్వయం చేసుకుని కసరత్తు నిర్వహిస్తున్నామన్నారు.

చిత్తూరు జిల్లాకు సంబంధించి ఓటర్ స్లిప్పుల పంపిణీ జరుగుతున్నట్లు వివరించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. 100 పోలింగ్ కేంద్రాల్లో (69 పట్టభద్రులు,31 ఉపాధ్యాయులు) వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు ఏజెన్సీని నియమించినట్లు తెలిపారు. 48 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించే కౌంటింగ్ నిర్వహణకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని సిబ్బందిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎఎస్పీ జగదీష్, ఆర్డీఓలు రేణుకా, సృజన, శివయ్య, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.